

సోమశిలలో నీటి నిల్వ

చేజర్ల(సోమశిల): సోమశిల జలాశయంలో ఆదివారం సాయంత్రానికి 36.468 టీఎంసీల నీరు నిల్వ ఉంది. జలాశయంలో 93.300 మీటర్ల నీటిమట్టం నమోదైంది.



బంగారం ధరలు

24 క్యారెట్లు (10 గ్రాములు) -	రూ.61,770
22 క్యారెట్లు ఆర్నమెంట్ (గ్రా) -	రూ.5,547
3 శాతం జీఎస్టీతో.. -	రూ.5,713
నవర (8 గ్రా) -	రూ.45,704

వాతావరణం

గరిష్ఠం/కనిష్ఠం
41.1 /31.3

ఆదివారం గాలిలో తేమ 35 శాతం ఉంది. సోమవారం వాతావరణంలో మార్పులు జరిగే అవకాశం ఉంది. అధిక ఉష్ణోగ్రతలు ఉంటాయని ఆ శాఖ అధికారులు తెలిపారు.

న్యూస్‌రీల్

17 వరకు ఒంటిపూట బడులు

నెల్లూరు(టౌన్): ఎండల తీవ్రత దృష్ట్యా జిల్లాలోని ప్రభుత్వ, ప్రైవేట్ పాఠశాలల విద్యార్థులకు ఈ నెల 12 నుంచి 17వ తేదీ వరకు ఒంటిపూట బడులు నిర్వహించాలని డీఈఓ గంగా భవాని ఆదివారం ఒక ప్రకటనలో తెలిపారు. ఉదయం 7.30 నుంచి 11.30 గంటల వరకు తరగతులు నిర్వహించాలని తెలిపారు. అలాగే ఉదయం 8.30 నుంచి 9 గంటల మధ్య విద్యార్థులకు రాగిజావ ఇవ్వాలని తెలిపారు. తరగతులు ముగిసిన తర్వాత 11.30 నుంచి 12 గంటల మధ్య విద్యార్థులు మధ్యాహ్న భోజనం తినేలా ఉపాధ్యాయులు చర్యలు తీసుకోవాలని తెలిపారు.

నేటి నుంచి గురుకులాల్లో ప్రవేశాలు

నెల్లూరు(వేదాయపాళెం): గురుకుల విద్యాలయ సంస్థ ఆధ్వర్యంలో నిర్వహిస్తున్న నెల్లూరు, గండిపాళెం, ఆత్మకూరు, తుమ్మలపెంట గురుకుల పాఠశాలల్లో ఈ నెల 12 నుంచి 14వ తేదీ వరకు సీట్ల కౌన్సెలింగ్ నిర్వహిస్తున్నట్లు ఏపీ గురుకుల పాఠశాలల జిల్లా కోఆర్డినేటర్ టి.కామేశ్వరి ఆదివారం ఒక ప్రకటనలో తెలిపారు. గురుకుల పాఠశాలల్లో 5, 6 7, 8వ తరగతుల ప్రవేశం కోసం మే 20వ తేదీన ప్రవేశ పరీక్ష నిర్వహించామని, ఎంపికైన విద్యార్థులు వారి సీట్ అలాట్‌మెంట్ ఆర్డర్ కాపీతో ఆయా గురుకుల పాఠశాలల ప్రిన్సిపల్ వద్ద ఈ నెల 12 నుంచి 14వ తేదీ లోపు హాజరుకావాలని తెలిపారు. వివరాలకు 97018 89873 మొబైల్ నంబర్‌లో సంప్రదించాలని తెలిపారు.

'దాహం.. దాహం' కవితా సంపుటి ఆవిష్కరణ



నెల్లూరు(బృందావనం): కవి, ఆడిటర్ చిన్ని నారాయణరావు దీర్ఘ కవితా సంపుటి 'దాహం ..దాహం'ను శాంతా బయోటెక్ వ్యవస్థాపక చైర్మన్, పద్మభూషణ్ డాక్టర్ వరప్రసాద్‌రెడ్డి ఆదివారం ఆవిష్కరించారు. నగరంలోని మినర్వా గ్రాండ్‌లో నిర్వహించిన కార్యక్రమంలో ఆయన మాట్లాడారు. రచయిత రాసిన దాహాల శీర్షికలను ప్రస్తావించారు. మొబైల్ ఫోన్ దాహం ప్రతి ఒక్కరిలో ఉందన్నారు. లాయర్ వారపత్రిక సంపాదకుడు తుంగా శివప్రభాత్‌రెడ్డి, చార్టర్డ్ అకౌంటెంట్ చిన్ని శ్రావణ్‌కుమార్, యాక్సిస్ బ్యాంక్ మేనేజర్ విశ్వనాథరెడ్డి, బొగ్గరపు రాధాకృష్ణమూర్తి, అవ్వారు శ్రీధర్‌బాబు, నలుబోలు బలరామయ్యనాయుడు, రమణయ్య తదితరులు పాల్గొన్నారు.

యువతిపై లైంగిక దాడి

నెల్లూరు(క్రైమ్): యువతిని బలవంతంగా ఆటోలో ఎక్కించుకుని వెళ్లారు. ఆపై ఆమెను చెట్ల పొదల్లోకి తీసుకెళ్లి కొందరు లైంగిక దాడి చేశారు. ఈ ఘటన గొలగమూడి క్రాస్‌రోడ్డు సమీపంలో ఆదివారం చోటుచేసుకుంది. సేకరించిన సమాచారం మేరకు.. శ్రీకాకుళం జిల్లాకు చెందిన ఓ యువతి కోవూరు మండలంలోని ఓ గ్రామంలో ఉంటున్న అక్క ఇంటికి నెల రోజుల క్రితం వచ్చింది. యువతి అక్క అనారోగ్యంగా ఉండడంతో పొగతోటలోని ఓ ఆస్పత్రిలో చికిత్స పొందుతోంది. అక్కకు తోడుగా యువతి వైద్యశాలలో ఉంటోంది. ఆదివారం మధ్యాహ్నం మందుల కోసం యువతి గాంధీబొమ్మ సెంటర్‌కు వచ్చింది. పెట్రోల్ బంక్ సమీపంలో గుర్తుతెలియని కొందరు ఆమెను బలవంతంగా ఆటోలో ఎక్కించుకుని నగర శివారులోని గొలగమూడి క్రాస్ రోడ్డు సమీపంలో పొదల్లోకి తీసుకెళ్లారు. అనంతరం ఆమెను చంపుతామని బెదిరించి ఆమెపై లైంగిక దాడి చేశారు. యువతి కేకలు వేయడంతో స్థానికంగా ఉన్న వారు 112కు ఫోన్ చేశారు. సమాచారం అందుకున్న వేదాయపాళెం పోలీసులు ఘటనా స్థలానికి రావడాన్ని గమనించిన నిందితులు అక్కడి నుంచి ఆటోలో పరారయ్యారు. పోలీసులు బాధితురాలిని తమ సంరక్షణలోకి తీసుకుని వివరాలు సేకరించారు. బాధితురాలి ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి ఆమెను ఆస్పత్రికి తరలించారు.

గోడను కూల్చిన వైద్య విద్యార్థులు

నెల్లూరు(క్రైమ్): క్రీడా మైదానం కోసం వైద్యవిద్యార్థులు గోడ కూల్చివేతపై దర్గామిట్ట పోలీసులు విచారిస్తున్నారు. పోలీసుల సమాచారం మేరకు.. జిల్లా ప్రభుత్వాస్పత్రి ఆవరణలో వైద్య కళాశాల ఉంది. దాని పక్కనే రెడ్‌క్రాస్ ఆధ్వర్యంలో నిర్వహిస్తున్న క్యాన్సర్ ఆస్పత్రికి గతంలో ప్రభుత్వాస్పత్రిలోని కొంత స్థలాన్ని ఇచ్చారు. ఈక్రమంలో వైద్యకళాశాల విద్యార్థులు మైదానం కోసం ఇటీవల కొంతస్థలాన్ని చదును చేశారు. ఆదివారం పక్కనే ఉన్న గోడను జేసీబీ సాయంతో కూల్చివేశారు. ఆ స్థలం తమదని క్యాన్సర్ హాస్పిటల్ నిర్వాహకులు దర్గామిట్ట పోలీసులకు ఫిర్యాదు చేశారు. పోలీసులు ఘటనా స్థలానికి చేరుకుని జేసీబీని, కొందరు వైద్యవిద్యార్థులను అదుపులోకి తీసుకున్నారు. ఈ ఘటనపై దర్యాప్తు చేస్తున్నారు.

బడికి వేళాయెె



వేసవి సెలవులు ముగిశాయి. నేడు బడి గంట మోగనుంది. జిల్లాలోని ప్రభుత్వ, ప్రైవేట్ పాఠశాలలు పునఃప్రారంభమవుతున్న నేపథ్యంలో విద్యార్థులు ఉత్సాహంగా పాఠశాలలకు వెళ్లేందుకు సిద్ధమయ్యారు. బడులు తెరిచిన తొలిరోజే విద్యార్థులకు విద్యాకానుకను కూడా అందించేందుకు ప్రభుత్వం ఏర్పాట్లు చేసింది. అంతేకాక ప్రభుత్వ పాఠశాలల్లో విద్యార్థులకు అవసరమైన అన్ని మౌలిక వసతులను కల్పించింది. ఇంగ్లిష్ ల్యాబ్‌లు, సీబీఎస్‌ఈ సిలబస్ అమలుతోపాటు జగనన్న గోరుముద్ద, అమ్మ ఒడి తదితర పథకాలను పక్కాగా అమలు చేస్తూ విద్యార్థుల అభ్యున్నతికి కృషి చేస్తోంది.

- నేటి నుంచి పాఠశాలలు పునః ప్రారంభం
- బడి తెరిచిన రోజే విద్యార్థులకు జగనన్న విద్యాకానుక
- 1,92,752 మందికి 8 రకాల వస్తువులు
- ఇప్పటికే పాఠశాలలకు చేరిన పాఠ్యపుస్తకాలు
- 63 పాఠశాలల్లో సీబీఎస్‌ఈ సిలబస్
- ఆంగ్ల మాధ్యమం అమలుతోపాటు ఇంగ్లిషు ల్యాబ్‌ల ఏర్పాటు



విద్యార్థులకు సౌకర్యవంతంగా తీర్చిదిద్దిన పొదలకూరు రోడ్డులోని జెడ్పీ ఉన్నత పాఠశాల ఆవరణ

నెల్లూరు(టౌన్): వేసవి సెలవుల అనంతరం విద్యార్థులు బడి బాట పట్టనున్నారు. సోమవారం పాఠశాలలు పునఃప్రారంభమవుతుండడంతో విద్యార్థులు బ్యాగులు చేతబట్టి బడులకు రానున్నారు. రాష్ట్ర ప్రభుత్వం 'నాడు-నేడు' కార్యక్రమం ద్వారా సర్కారు బడులను కార్పొరేట్ స్కూళ్లకు దీటుగా తీర్చిదిద్దిన నేపథ్యంలో విద్యార్థులకు అన్ని మౌలిక వసతులు సమకూరాయి. అంతేకాక ప్రభుత్వ బడుల్లో చదివే పేద విద్యార్థుల కోసం అనేక సంక్షేమ పథకాలను అమలు చేస్తోంది. సీబీఎస్‌ఈ సిలబస్‌ను అమలు చేసేలా చర్యలు చేపట్టింది. ఆంగ్ల మాధ్యమం అమలుతోపాటు ఇంగ్లిషు ల్యాబ్‌లు, స్మార్ట్ టీవీలను వినియోగించి డిజిటల్ బోధన చేసేలా చర్యలు తీసుకుంది. నాణ్యమైన విద్యను అందించేందుకు బైజూస్ సంస్థతో ఒప్పందం చేసుకుని సులభరీతిలో పాఠాలను అర్థం చేసుకునేలా విద్యార్థులకు కంటెంట్‌ను అందిస్తోంది. సర్కారు బడుల్లో చదివే విద్యార్థుల కోసం ప్రభుత్వం ఇన్ని సౌకర్యాలు కల్పిస్తున్న నేపథ్యంలో ప్రైవేట్ స్కూళ్ల నుంచి ప్రభుత్వ పాఠశాలల్లో చేరేందుకే మొగ్గుచూపుతున్నారు. జిల్లాలో ఏటా సుమారు 5 వేల మందికి పైగా విద్యార్థులు ప్రభుత్వ బడుల్లో చేరుతున్నట్లు తెలుస్తోంది.

తొలిరోజే విద్యాకానుక

పాఠశాలలు పునఃప్రారంభమైన తొలిరోజే విద్యార్థులకు జగనన్న విద్యాకానుకను అందించేందుకు ప్రభుత్వం చర్యలు తీసుకుంది. తద్వారా ప్రభుత్వ బడుల్లో చదివే 1,92,782 మంది విద్యార్థులకు ఈ విద్యాకానుక అందనుంది. అందులో పాఠ్యపుస్తకాలు, నోటుపుస్తకాలు, బ్యాగు, బెల్టు, బూట్లు, డిక్షనరీ, 3 జతల యూనిఫాం, సాక్సులు అందజేయనున్నారు. కాగా ఇప్పటికే జగనన్న విద్యాకానుక కిట్లు జిల్లాలోని ఆయా పాఠశాలలకు చేరాయి.



యూనిఫాంకు సంబంధించి కుట్టుకూలిని విద్యార్థుల తల్లి బ్యాంక్ అకౌంట్‌లో ప్రభుత్వం జమ చేయనుంది.

సీబీఎస్‌ఈ సిలబస్ అమలుకు చర్యలు

సర్కారు బడుల్లో సీబీఎస్‌ఈ సిలబస్‌ను ఈ విద్యా సంవత్సరం నుంచి ప్రభుత్వం అమలు చేయనుంది. జిల్లాలో సీబీఎస్‌ఈ సిలబస్‌కు తొలి విడతలో 63 పాఠశాలలను ఎంపిక చేశారు. 10 మోడల్ స్కూల్స్, 6 ఏపీఆర్ఈఐ సొసైటీలు, 8 సోషల్ వెల్ఫేర్, 12 ట్రైబల్ వెల్ఫేర్, 12 కేజీబీవీ పాఠశాలలు, 2 ఆశ్రమ్ స్కూల్స్, 12 జెడ్పీ హైస్కూళ్లలో సీబీఎస్ఈ సిలబస్‌ను బోధించనున్నారు. క్రమేణా మిగిలిన పాఠశాలల్లో కూడా సీబీఎస్ఈ సిలబస్‌ను అమలు చేయనున్నారు.

జిల్లాలో..

ప్రభుత్వ పాఠశాలలు	2,624
ప్రాథమిక	2,039
ప్రాథమికోన్నత	245
ఉన్నత పాఠశాలలు	340
విద్యార్థుల సంఖ్య	1,92,752 మంది
కార్పొరేట్, ప్రైవేట్ పాఠశాలలు	812
విద్యార్థుల సంఖ్య	1.02 లక్షల మంది

జిల్లాలోని ప్రభుత్వ బడుల్లో తరగతుల వారీగా విద్యార్థుల సంఖ్య

తరగతి	విద్యార్థుల సంఖ్య
2వ తరగతి	16,537
3వ తరగతి	15,191
4వ తరగతి	19,563
5వ తరగతి	21,725
6వ తరగతి	21,289
7వ తరగతి	21,248
8వ తరగతి	20,232
9వ తరగతి	21,056
10వ తరగతి	19,373

ఆంగ్ల మాధ్యమం అమలు

కార్పొరేట్ పాఠశాలలకు దీటుగా ప్రభుత్వ బడుల్లో 1వ తరగతి నుంచి 10వ తరగతి వరకు ఆంగ్ల మాధ్యమాన్ని ప్రభుత్వం అమలు చేస్తోంది. విద్యార్థులకు నాణ్యమైన బోధనను అందించేందుకు ఉపాధ్యాయులకు ప్రతి ఏటా నిపుణులతో ప్రత్యేక శిక్షణ ఇస్తున్నారు.

గోరుముద్దతో పౌష్టికాహారం

ప్రభుత్వ బడుల్లో చదువుతున్న విద్యార్థులకు పౌష్టికాహారం అందించాలన్న లక్ష్యంతో ప్రభుత్వం జగనన్న గోరుముద్ద పథకాన్ని అమలు చేస్తోంది. ప్రతిరోజూ ఒక వెరైటీతో నాణ్యమైన ఆహారాన్ని విద్యార్థులకు అందించేలా చర్యలు తీసుకుంటోంది. విద్యార్థులకు వారంలో 5 రోజులు కోడిగుడ్లు, 3 రోజులు చిక్కీలు, 3 రోజులు రాగిజావను అందిస్తోంది. అలాగే పులిహోర, వెజిటబుల్ బిరియాని.. పుదీనా, కరివేపాకుతో వండిన రైస్, మామూలు రైస్, ఆకుకూరలు, పప్పుతో కూడిన ఆహారాన్ని అందించేలా చర్యలు చేపడుతోంది. కాగా ఇప్పటికే ఈ పథకానికి సంబంధించిన సరుకులను పాఠశాలలకు చేర్చాలని జిల్లా విద్యాశాఖ అధికారులు ఆదేశాలు జారీ చేశారు.

అమ్మ ఒడితో అండ

ప్రభుత్వ, ప్రైవేట్ పాఠశాలల్లో చదువుతున్న అర్హులైన విద్యార్థులకు రాష్ట్ర ప్రభుత్వం అమ్మ ఒడి పథకం ద్వారా ప్రతి ఏటా రూ.15 వేలు అందజేస్తోంది. 2019-20 విద్యా సంవత్సరంలో 2,20,607 మంది విద్యార్థులకు రూ.330.91 కోట్లు, 2020-21 విద్యా సంవత్సరంలో 2,30,207 మంది విద్యార్థులకు రూ.345.31 కోట్లు, 2021-22 విద్యా సంవత్సరంలో 2,00,366 మందికి రూ.300.54 కోట్లు ఆయా విద్యార్థుల తల్లుల బ్యాంక్ అకౌంట్లలో ప్రభుత్వం అందజేసింది. 2022-23 విద్యా సంవత్సరంలో 2 లక్షల మందికి పైగా విద్యార్థులకు అమ్మ ఒడి పథకం వర్తించనుంది. ఇప్పటికే అర్హులైన విద్యార్థులు ఈ పథకం లబ్ధి కోసం సచివాలయాల ద్వారా దరఖాస్తు చేసుకోవాలని అధికారులు తెలిపారు. ఈ విధంగా ప్రభుత్వ పాఠశాలల్లో చదువుతున్న విద్యార్థులు ఒక్క పైసా కూడా ఖర్చు చేయకుండా నాణ్యమైన విద్యను అందించేందుకు ప్రభుత్వం చర్యలు తీసుకుంటోంది.



నెల్లూరులోని పొదలకూరు రోడ్డులో ఉన్న జెడ్పీ ఉన్నత పాఠశాల

ప్రతి విద్యార్థి బడికి వచ్చేలా చూడాలి



సోమవారం నుంచి పాఠశాలలు పునః ప్రారంభం కానున్నాయి. ప్రతి ఉపాధ్యాయుడు రెగ్యులర్‌గా పాఠశాలకు రావాలి. అలాగే పిల్లలు బడికి వచ్చేలా వారిని ప్రోత్సహించాలి. అలసత్వం లేకుండా విద్యార్థులను తీర్చిదిద్దాలి. ప్రారంభం రోజునే జగనన్న విద్యాకానుక అందజేస్తున్నాం. ప్రభుత్వ పాఠశాలల్లో అన్ని సౌకర్యాలు ఉన్నాయి. – గంగాభవానీ, డీఈఓ

టీడీపీలో 'ఆ ముగ్గురి' కుంపటి

- జిల్లాలో అన్ని నియోజకవర్గాల్లోనూ ఆశావహుల్లో నైరాశ్యం
- రేపటి నుంచి జిల్లాలోకి లోకేష్ యువగళం యాత్ర
- విజయవంతం చేస్తామంటూ ఆర్భాటాలు

జిల్లాలో ఉనికి కోల్పోయిన టీడీపీ తన బలాన్ని చూపించేందుకు ప్రయత్నిస్తోంది. ఇన్నాళ్లు పార్టీకి నమ్మకస్తులుగా పనిచేసిన వారిని అవసరమైన మేర వినియోగించుకున్న టీడీపీ పెద్దలు.. ప్రస్తుతం అధికారపార్టీ సస్పెండ్ చేసిన ముగ్గురు ఎమ్మెల్యేలకు తాయిలాలతోపాటు టికెట్లు ఇస్తామని తమ పార్టీలోకి ఆహ్వానించి పట్టం కడుతున్నారు. ఈ ముగ్గురు ఎమ్మెల్యేలతో జిల్లా రాజకీయాలను ప్రభావితం చేయాలని భావిస్తుండగా, ఎమ్మెల్యే అభ్యర్థిని అనిపించుకోవాలని తహతహలాడుతున్న ఆశావహుల్లో నైరాశ్యం కనిపిస్తోంది.



సాక్షి ప్రతినిధి, నెల్లూరు: జిల్లాలోని ఎనిమిది నియోజకవర్గాల్లో టీడీపీ ఉనికిని కోల్పోయింది. ఒకటి.. రెండు నియోజకవర్గాల్లో మాజీలే పెత్తనం చేస్తున్నా.. చివరికి వారికి సైతం టికెట్ ఇస్తారనే ఆశలు సన్నగిల్లాయి. మిగతా నియోజకవర్గాల్లో అయితే మండలస్థాయిలో కూడా పలుకుబడి లేని నేతలే ఇన్‌చార్జిలుగా చెలామణి అవుతున్న పరిస్థితి ఉంది. మంగళవారం నుంచి జిల్లాలో లోకేష్ యువగళం యాత్ర ప్రారంభం కానున్న నేపథ్యంలో ఈ కార్యక్రమానికి అండగా నిలిచేందుకు ఏ నియోజకవర్గం నేత కూడా ముందుకు రాని పరిస్థితి నెలకొంది. అధికారపార్టీ నుంచి సస్పెండ్ అయిన ముగ్గురు ఎమ్మెల్యేలను రంగంలోకి దించి, వారినే ముందుంచేందుకు టీడీపీ అధినేత చంద్రబాబు ప్రయత్నించినట్లు తెలుస్తోంది. తాజాగా ఆ ముగ్గురు లోకేష్ యాత్రను విజయవంతం చేస్తామంటూ మీడియా ముందుకువచ్చి ఆర్భాటం చేయడంపై విమర్శలు వినిపిస్తున్నాయి.

ఆ ముగ్గురే దిక్కా

టీడీపీ పరిస్థితి చూస్తే జిల్లాలో వైఎస్సార్‌సీపీ బహిష్కృత ఎమ్మెల్యేలే వారికి దిక్కుగా కనిపిస్తోంది. టీడీపీలో మంత్రులుగా, ఎమ్మెల్యేలుగా, రాష్ట్ర, జిల్లా స్థాయిల్లో పదవులు అనుభవించిన అగ్ర నాయకులు ఉన్నారు. పార్టీ పొలిట్ బ్యూరో సభ్యుడు సోమిరెడ్డి చంద్రమోహన్‌రెడ్డి నుంచి మాజీ మంత్రి నారాయణ, బీద రవిచంద్ర వంటి కీలక నాయకులు ఉన్నప్పటికీ రెండు రోజుల్లో ప్రారంభం కానున్న లోకేష్ యాత్రకు సంబంధించిన బాధ్యతలను తమ భుజస్కంధాలపై వేసుకునేందుకు వారి నుంచి చొరవ కనిపించలేదు. యాత్రకు సంబంధించి ముందస్తు ప్రణాళికల హడావుడి కూడా లేదు. లోకేష్ యాత్రను విజయవంతం చేసే బాధ్యతను ఆనం రామనారాయణరెడ్డికి అప్పగించేందుకు టీడీపీ జిల్లా నేతలందరూ ఆయన ఇంటికి వెళ్లడం చూస్తే పార్టీకి ఉన్న ఆదరణ అర్థమవుతోంది.

ఎమ్మెల్యే అభ్యర్థిని అనిపించుకునేందుకు..

రానున్న ఎన్నికల్లో టీడీపీ నుంచి పోటీ చేయడానికి సీనియర్లు ఎవరూ సిద్ధంగా లేరని తెలుస్తోంది. క్షేత్రస్థాయిలో టీడీపీకి ప్రజాదరణ లేకపోవడంతో గెలుస్తామనే ధీమా లేక తమ వారసులను రంగంలోకి దింపాలని ప్రయత్నిస్తుండగా, మరికొన్ని నియోజకవర్గాల్లో కేవలం ఎమ్మెల్యే అభ్యర్థినని అనిపించుకునేందుకు కొందరు తహతహలాడుతున్నట్లు సమాచారం. సర్వేపల్లి నియోజకవర్గం నుంచి వరుసగా ఓటమిపాలైన టీడీపీ సీనియర్ నేత, మాజీ మంత్రి, పొలిట్ బ్యూరో సోమిరెడ్డికే టికెట్ కన్ఫర్మేషన్ లేదు. ఈ దఫా ఆయన తన కుమారుడిని ఎన్నికల బరిలో నిలపాలని భావిస్తున్నా.. టీడీపీ అధిష్టానం నుంచి సానుకూల స్పందన లేకపోవడంతో సోమిరెడ్డి సైతం అంటీముట్టనట్లుగా వ్యవహరిస్తున్నారని తెలిసింది. ఈ నేపథ్యంలో నేరుగా చంద్రబాబే రంగంలోకి దిగి వైఎస్సార్‌సీపీ బహిష్కృత ఎమ్మెల్యేలతో మంతనాలు జరిపి హడావుడి చేయిస్తున్నట్లు సమాచారం. కోవూరులోనూ మాజీ ఎమ్మెల్యే పోలంరెడ్డి శ్రీనివాసులురెడ్డికి కూడా టికెట్ రావడం కష్టమేనని సూచనలు ఉండడంతో ఆయన కుమారుడిని రంగంలోకి దింపాలనే యోచనలో ఉన్నట్లు తెలిసింది. అయితే కోవూరు టికెట్‌పై స్పష్టత లేకపోవడంతో వీరు సైతం లోకేష్ యాత్రపై చొరవ చూపించడం లేదు. ఇప్పటికే కోవూరు నుంచి టీడీపీ సీనియర్ నేతలు చేజర్ల వెంకటేశ్వర్లురెడ్డి, పెళ్లకూరు శ్రీనివాసులురెడ్డి కూడా టికెట్ కోసం ప్రయత్నాలు సాగిస్తున్నారు. కావలి నియోజకవర్గానికి సంబంధించి పంచాయతీ స్థాయి నాయకుడిని నియోజకవర్గ ఇన్‌చార్జిగా ఉంచారు. ఆయనకు పోటీగా కావ్య కృష్ణారెడ్డి తెరపైకి రావడంతో పార్టీకి, యువగళం యాత్ర కోసం రూ.కోట్లు ధారపోసిన మాలేపాటి సుబ్బానాయుడు పరిస్థితిని అర్థం చేసుకోవచ్చు. ఉదయగిరి నియోజకవర్గంలో ఉనికి లేని టీడీపీ నుంచి పోటీ చేయడానికి సుముఖంగా లేని మాజీ ఎమ్మెల్యే బొల్లినేని వెంకటరామారావు ముందుగానే చేతులెత్తేశారు. ఈ నేపథ్యంలో కాకర్ల సురేష్ తనకే టికెట్ వస్తుందని ప్రజల్లోకి వెళ్లేందుకు ప్రయత్నాలు చేస్తుండగా మేకపాటి చంద్రశేఖర్‌రెడ్డి అతనికి పోటీ అయ్యారు. లోకేష్ యాత్రకు సంబంధించి హడావుడి చేస్తున్నారు. ఆత్మకూరులో ఆనం రామనారాయణరెడ్డి ఎంట్రీతో కన్నబాబుకు మళ్లీ చుక్కెదురవుతోంది. తనకే టికెట్ వస్తుందని ఆశలు పెట్టుకున్న కన్నబాబు స్థానంలో ఆనంను తీసుకురావడంతో ఆయన చిన్నబోయినట్లు సమాచారం. ఆదివారం ఆత్మకూరులో జరిగిన నియోజకవర్గస్థాయి సమావేశానికి సైతం కన్నబాబు దూరంగా ఉన్నారు. ఇక నెల్లూరు రూరల్ పరిస్థితి చూస్తే అధికారపార్టీ బహిష్కృత ఎమ్మెల్యే కోటంరెడ్డి శ్రీధర్‌రెడ్డి టీడీపీ అభ్యర్థి అవుతారని ఖాయం కావడంతో తానే రూరల్ నియోజకవర్గానికి టీడీపీ అభ్యర్థిని అనుకున్న అబ్దుల్ అజీజ్ పరిస్థితి అగమ్యగోచరంగా మారింది. నెల్లూరు సిటీ పరిస్థితి అందుకు భిన్నంగా ఏమీ లేదు. ఇక్కడి నుంచి కోటంరెడ్డి శ్రీనివాసులురెడ్డి ఈ దఫా తనకే టికెట్ కావాలని తీవ్రంగా ప్రయత్నం చేస్తున్నారు. బాలకృష్ణ ద్వారా రాయభారం చేయిస్తున్నా.. ఆయనకు టికెట్ కన్ఫర్మేషన్ లేదని సమాచారం. దీనిని బట్టి చూస్తే జిల్లాలో టీడీపీ పరిస్థితి ఎలా ఉందో అందరికీ అర్థమవుతుంది.

డీటీలకు పదోన్నతులు

నెల్లూరు(దర్గామిట్ట): జిల్లాలో రెవెన్యూ శాఖకు సంబంధించి డిప్యూటీ తహసీల్దార్లకు తహసీల్దార్లుగా పదోన్నతి ఇస్తూ రెవెన్యూశాఖ చీఫ్ కమిషనర్ జి.సాయిప్రసాద్ ఆదివారం ఉత్తర్వులు జారీ చేశారు. అడహక్ తహసీల్దార్లుగా విధులు నిర్వహిస్తున్న డిప్యూటీ తహసీల్దార్లకు కూడా పలువురికి పదోన్నతులు లభించాయి. జిల్లాలో పనిచేస్తున్న కె.జయజయరావు, ఎం.గయాజ్‌అహ్మద్, షేక్ అబ్దుల్‌హమీద్, అన్నదాత వెంకటరమణారావు, జి.జులియాభాయ్, ఎం.సుభద్ర, ఎస్.రవీంద్రలకు పదోన్నతి లభించింది. వీరితోపాటు జిల్లాలో పనిచేస్తున్న సాయికృష్ణను ఎన్‌టీఆర్ జిల్లాకు, మణెమ్మ, విజయకుమార్, శ్యామలకుమారిలను బాపట్ల జిల్లాకు, జీఎస్ కృష్ణప్రసాద్ నెల్లూరులో విజిలెన్స్‌కు, ఎం.నిరంజన్, సానా శ్రీనివాసులురెడ్డి, ఆవుల సురేష్, బసిరెడ్డి జయవర్ధన్ నెల్లూరు నుంచి ప్రకాశం జిల్లాకు, వీరవసంతరావు, షేక్ మీరావలి గుంటూరు నుంచి నెల్లూరుకు, కందల స్ఫూర్తి నెల్లూరులో, మిడసాల హరిబాబు ప్రకాశం నుంచి నెల్లూరుకు పదోన్నతిపై రానున్నారు.

వైభవంగా వెంగమాంబ బ్రహ్మోత్సవాలు ప్రారంభం



యాగశాలలో పూజలు చేస్తున్న అర్చకుడు



పసుపు దంచడానికి పోటీపడుతున్న భక్తులు

- పసుపు దంచే కార్యక్రమంలో భారీగా పాల్గొన్న మహిళలు

దుత్తలూరు: మండలంలోని నర్రవాడలో వెలసిన శ్రీవెంగమాంబ పేరంటాలు బ్రహ్మోత్సవాలు ఆదివారం వైభవంగా ప్రారంభమయ్యాయి. ఉత్సవాల్లో మొదటి రోజు నిలుపు కార్యక్రమాన్ని వడ్డిపాళెంలోని వెంగమాంబ పుట్టినిల్లయిన పచ్చవ వారి దేవరింట్లో అత్యంత భక్తిశ్రద్ధలతో నిర్వహించారు. ఈ సందర్భంగా రేణుకా ఎల్లమ్మ ఆలయంలో, వెంగమాంబ పేరంటాలు దేవస్థానంలో అమ్మవార్లను ప్రత్యేకంగా అలంకరించి విశేష పూజలు చేశారు. వెంగమాంబ ఆడపడుచులు, పచ్చవ వంశానికి చెందిన కుటుంబసభ్యులు పసుపు దంచే కార్యక్రమాన్ని భక్తిశ్రద్ధలతో నిర్వహించగా జిల్లాలోని వివిధ ప్రాంతాల నుంచి వచ్చిన మహిళా భక్తులు ఎంతో ఉత్సాహంగా పాల్గొన్నారు. ఈ కార్యక్రమం అనంతరం వెంగమాంబ వంశస్తులు, భక్తులు పసుపు, కుంకుమలను ప్రత్యేక వాహనంలో ఊరేగింపుగా వెంగమాంబ అమ్మవారి ఆలయానికి తీసుకువచ్చి అమ్మవారికి ప్రత్యేక పూజలు చేశారు. సంతానం కోసం మహిళలు దేవాలయంలో అమ్మవారి వద్ద వరపడ్డారు. అంతకుముందు ఆలయం వద్ద యాగశాలలో ధర్మకర్తలు ప్రత్యేక హోమాలు నిర్వహించారు. ఈ సందర్భంగా ఆలయం వద్ద ప్రదర్శించిన సాంస్కృతిక కార్యక్రమాలు అలరించాయి. వైఎస్సార్‌సీపీ నియోజకవర్గ పరిశీలకుడు మెట్టుకూరు ధనుంజయరెడ్డి అమ్మవారిని దర్శించుకొని పూజలు చేశారు. వైఎస్సార్‌సీపీ మండల కన్వీనర్ వాసిపల్లి వెంకటేశ్వర్లురెడ్డి పాల్గొన్నారు.

ఉత్సవాల్లో నేడు

బ్రహ్మోత్సవాల్లో భాగంగా రెండో రోజు సోమవారం రాత్రి శ్రీవెంగమాంబ అమ్మవారు – గురవయ్యస్వామి దంపతులకు గ్రామోత్సవం నిర్వహించనున్నారు. గ్రామోత్సవం వడ్డిపాళెం నుంచి ప్రారంభమై నర్రవాడ, గుదెవారిపాళెం, ఉలవవారిపాళెం మీదుగా ఆలయం వద్దకు చేరుకుంటుంది. సంతానం లేని మహిళలు అమ్మవారి వద్ద వరపడతారు.

ప్రజల ఆశీస్సులతోనే ఈ స్థాయికి ఎదిగా

- మాజీ ఉపరాష్ట్రపతి వెంకయ్యనాయుడు

దుత్తలూరు: ప్రజల ఆశీస్సులతోనే ఉదయగిరి నుంచి భారత ఉపరాష్ట్రపతి స్థాయికి ఎదిగానని మాజీ ఉపరాష్ట్రపతి ముప్పవరపు వెంకయ్యనాయుడు పేర్కొన్నారు. దుత్తలూరులో, నర్రవాడలోని వెంగమాంబ కల్యాణ వేదికలో ఆదివారం ఆత్మీయ సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ అప్పటి రాజకీయాలు చాలా ఆదర్శంగా ఉండేవన్నారు. 1978–83 అసెంబ్లీ, 1977 పార్లమెంట్ ఎన్నికల్లో పోటీ చేసిన సమయంలో ఇక్కడి ప్రజలు తనకెంతో అండగా ఉన్నారని గుర్తుచేసుకున్నారు. ఏ గ్రామానికి వెళ్లినా అన్నివర్గాల ప్రజలు ఘనస్వాగతం పలికేవారని తెలిపారు. రాష్ట్రంలో ఆదర్శప్రాయమైన ఎన్నిక ఆ రోజుల్లో ఉదయగిరిలో జరిగిందన్నారు. ఉదయగిరి ప్రజలు నీతి, నిజాయితీలతో ఉంటారని, వారి ప్రేమ, ఆప్యాయతలను తాను, తన కుటుంబసభ్యులు ఎన్నటికీ మరువలేమని తెలిపారు. ప్రస్తుతం రాజకీయ ప్రక్షాళన జరగాల్సిన అవసరం ఎంతైనా ఉందన్నారు. ఇందుకోసం యువత, రైతులు ముందుకురావాలని పిలుపునిచ్చారు. ఈ సందర్భంగా వెంకయ్యనాయుడు దంపతులను పలువురు రాజకీయ నాయకులు, ఆత్మీయులు ఘనంగా సన్మానించి జ్ఞాపికలు అందజేశారు.



వెంకయ్యనాయుడు దంపతులకు స్వాగతం పలుకుతున్న ఆలయ అర్చకులు

వెంగమాంబకు ప్రత్యేక పూజలు

నర్రవాడలో శ్రీవెంగమాంబ పేరంటాలు అమ్మవారిని మాజీ ఉపరాష్ట్రపతి వెంకయ్యనాయుడు దంపతులు దర్శించుకుని ప్రత్యేక పూజలు చేశారు. తొలుత ఆలయ అర్చకులు, వ్యవస్థాపక ధర్మకర్తలు, ఈఓ వారికి పూర్ణకుంభంతో ఘనస్వాగతం పలికారు. వేద పండితుల మంత్రోచ్చారణల నడుమ అమ్మవారికి ప్రత్యేక పూజలు నిర్వహించి తీర్థప్రసాదాలతోపాటు అమ్మవారి చిత్రపటాన్ని బహూకరించారు.

క్లుప్తంగా

అప్పు చెల్లించమన్నందుకు ఇద్దరిపై దాడి

అనుమసముద్రంపేట : ఇచ్చిన అప్పు తిరిగి చెల్లించమన్నందుకు భాస్కర్ అనే వ్యక్తి వెంకటేశ్వర్లు, కామేశ్వరమ్మపై దాడికి దిగిన ఘటన ఏఎస్‌పేట మండల కేంద్రంలో ఆదివారం చోటుచేసుకుంది. బాధితులు తెలిపిన వివరాల మేరకు.. ఏఎస్‌పేట మండలంలోని చిరమన గ్రామానికి చెందిన వెంకటేశ్వర్లు, కామేశ్వరమ్మ రూ.2 లక్షల నగదును అదే గ్రామానికి చెందిన భాస్కర్, ఈశ్వరమ్మలకు రెండు సంవత్సరాల క్రితం అప్పుగా ఇచ్చారు. అప్పటి నుంచి వారు వడ్డీ కూడా చెల్లించకపోవడంతో మూడు రోజుల నుంచి నగదు తిరిగి ఇవ్వాలని భాస్కర్ ఇంటి చుట్టూ వెంకటేశ్వర్లు తిరుగుతున్నాడు. పెద్ద మనుషుల సమక్షంలో సమస్యను పరిష్కరించుకునేందుకు భాస్కర్‌ను రాజవోలు పిలిచేందుకు ఆదివారం వెళ్లగా అతను పనికి వెళ్లి ఉన్నాడు. కాగా ఏఎస్‌పేటకు సమీపంలోని గుడిపాడు రోడ్డు వద్ద వెంకటేశ్వర్లు, కామేశ్వరమ్మకు భాస్కర్ ఎదురుకావడంతో రాజవోలు రావాలని పిలిచారు. ఇంతలో మాటమాట పెరగడంతో కొయ్యపని చేసే ఉలితో భాస్కర్ వీరిద్దరిపై దాడి చేసి గాయపరిచారు. చికిత్స నిమిత్తం వీరిని ఆత్మకూరు జిల్లా వైద్యశాలకు తరలించారు. ఎస్సై నరేష్ ఘటనా స్థలానికి వెళ్లి దాడి చేసిన భాస్కర్‌ను అదుపులోకి తీసుకున్నారు. ఈ విషయంపై పూర్తిగా దర్యాప్తు చేయనున్నట్లు తెలిపారు.

కాంట్రాక్ట్ లెక్చరర్ల జేఏసీ రాష్ట్ర కో చైర్మన్‌గా శ్రీనివాస్



నెల్లూరు(టౌన్): కాంట్రాక్ట్ లెక్చరర్ల జేఏసీ రాష్ట్ర కో చైర్మన్‌గా జిల్లాకు చెందిన కల్లూరి శ్రీనివాసులు నియమితులయ్యారు. విజయవాడలో కాంట్రాక్ట్ అధ్యాపకుల అసోసియేషన్ సమావేశం నిర్వహించారు. శనివారం రాత్రి జరిగిన ఈ సమావేశంలో జేఏసీ కమిటీని ఎన్నుకున్నట్లు శ్రీనివాస్ తెలిపారు. కాంట్రాక్ట్ అధ్యాపకుల సమస్యల పరిష్కారానికి తనవంతు కృషి చేస్తామన్నారు.

రైస్‌మిల్లులో విజిలెన్స్ తనిఖీలు

- భారీగా పీడీఎస్ బియ్యం నిల్వలు
- రూ.72 లక్షల విలువైన బియ్యం స్వాధీనం
- మిల్లు నిర్వాహకులతో పాటు పలువురిపై 6–ఏ కింద కేసు నమోదు



మిల్లులో తనిఖీలు నిర్వహిస్తున్న విజిలెన్స్ అధికారులు

కావలి: మండలంలోని మద్దూరుపాడులో జేకే రైస్ ట్రేడర్స్‌కి చెందిన రైస్ మిల్లుపై నెల్లూరు విజిలెన్స్ అండ్ ఎన్‌ఫోర్స్‌మెంట్ అధికారులు ఆదివారం రాత్రి ఆకస్మికంగా దాడులు చేశారు. కావలి సీఎస్‌డీటీ, ఇతర అధికారులతో కలిసి మిల్లులో తనిఖీలు చేపట్టగా భారీ స్థాయిలో పీడీఎస్ బియ్యం బయటపడింది. మొత్తం 88 క్వింటాల పీడీఎస్ బియ్యంతో పాటు 78 క్వింటాల నూకలు, 70 క్వింటాల రిజెక్షన్ రైస్, 2,990 క్వింటాల ధాన్యం నిల్వలు గుర్తించారు. రికార్డులు సరిగా లేని మొత్తం రూ.72,62,500 విలువైన బియ్యం, ధాన్యంతో పాటు ఒక బొలెరో వాహనాన్ని స్వాధీనం చేసుకుని నిర్వాహకుడు జయకృష్ణతో పాటు బొలెరో యజమాని మాధవ, పీడీఎస్ బియ్యం కొనుగోలుకు మధ్యవర్తిగా వ్యవహరించిన శ్రీనివాసులురెడ్డి, ఎండీయూ ఆపరేటర్ కొండలరావు, రైస్‌మిల్లు గుమస్తా ప్రభాకర్‌పై నిత్యావసర వస్తువుల చట్టం 6ఏ కింద కేసులు నమోదు చేశారు.

నెల్లూరు పౌల్ట్రీ అసోసియేషన్ ధరలు

బ్రాయిలర్ (లైవ్)	: 172
లేయర్ (లైవ్)	: 105
బ్రాయిలర్ చికెన్	: 290
బ్రాయిలర్ స్కిన్‌లెస్	: 320
లేయర్ చికెన్	: 178



క్రీడోత్సాహం

- ప్రభుత్వ ఆధ్వర్యంలో క్రీడల్లో శిక్షణ
- జిల్లా వ్యాప్తంగా 50 శిబిరాల ఏర్పాటు
- ఉత్సాహంగా పాల్గొంటున్న బాలబాలికలు
- ఏసీ సుబ్బారెడ్డి స్పోర్ట్స్ కాంప్లెక్స్‌లో శిక్షణ



ఏసీ సుబ్బారెడ్డి స్టేడియంలో ఖోఖో ఆడుతున్న యువకులు

నెల్లూరు (స్టోన్‌హౌస్‌పేట): ఉదయం బ్యాగ్‌లతో బడికి పరుగులు తీయడం.. సాయంత్రం ఇళ్లకు చేరడం.. మామూలు రోజుల్లో బాలబాలికలు చేసే పని ఇది. కొందరు హోంవర్క్‌లు చేస్తారు. మరికొందరు ట్యూషన్లకు వెళ్తుంటారు. అనేకమంది స్మార్ట్ ఫోన్‌లో గేమ్స్ ఆడుతూ ఉండిపోతారు. చాలా తక్కువ మంది మాత్రమే ఆటలకు వెళ్తుంటారు. గ్రౌండ్‌లకు చేరి తమకు నచ్చిన దాంట్లో శిక్షణ తీసుకుంటున్నారు. కొంతకాలంగా ప్రభుత్వం అందిస్తున్న వేసవి క్రీడా శిక్షణ శిబిరాల్లో వేలాది మంది బాలబాలికలు, యువత పాల్గొంటున్నారు. ఉదయం లేచి షూలు వేసుకుని కిట్లతో గ్రౌండ్లకి రావడం వారికి కొత్త ఆనందాన్ని కలిగిస్తోంది. నెల్లూరులోని విశాలమైన ఏసీ సుబ్బారెడ్డి స్పోర్ట్స్ కాంప్లెక్స్ కళకళలాడుతోంది. మొదట ఫిట్‌నెస్ ఎక్సర్‌సైజులు చేయిస్తున్నారు. అనంతరం సంబంధిత క్రీడాంశాల్లో ప్రాథమిక సూత్రాలను నేర్పిస్తున్నారు. ఉదయం, సాయంత్రం వేళల్లో పిల్లలు శారీరక, మానసికోల్లాసాన్ని పొందుతున్నారు. ఇప్పటి వరకు ఇరుకు గదుల్లో సెల్‌ఫోన్లతో సాగిన జీవితం గత నెలరోజులుగా పిల్లలకు కొత్త అనుభూతిని ఇచ్చింది. జిల్లా వ్యాప్తంగా ప్రభుత్వం 50 ఉచిత వేసవి క్రీడా శిక్షణ శిబిరాలు ఏర్పాటు చేసింది. ఒక్క ఏసీ సుబ్బారెడ్డి స్టేడియంలో 17 క్రీడాంశాల్లో శిక్షణ ఇస్తున్నారు. సుమారు 900 మంది క్రీడాకారులు ఇందులో పాల్గొంటున్నారు.

అమ్మకు మంచిపేరు తెస్తా



నేను 6వ తరగతి చదువుతున్నాను. మా అమ్మ ఫాతిమా వలంటీర్‌గా పనిచేస్తోంది. ఎస్పీ బంగ్లా పక్కన మా ఇల్లు. ఈ సమ్మర్ క్యాంప్‌లో ఖోఖోలో మా అమ్మ చేర్పించింది. రోజూ ఉదయం, సాయంత్రం గ్రౌండ్‌కు తీసుకొస్తుంది. ఆమె చెప్పినట్లే చదువుల్లో, ఆటల్లో రాణించి మంచిపేరు తెస్తా.

– ఎస్‌డీ రుష్, నెల్లూరు

శిక్షణలో చిన్నారులు భేష్



శిక్షణ శిబిరాల్లో అనేకమంది మొదటిసారి వచ్చారు. వారంతా ఎంతో చక్కగా ఆడుతున్నారు. హాకీ పట్ల చాలామందికి ఎంతో శ్రద్ధ ఉంది. ఉదయం, సాయంత్రాల్లో క్రమం తప్పకుండా నేర్చుకుంటున్నారు. తల్లిదండ్రులు సైతం ప్రోత్సహిస్తున్నారు. ఇదే విధంగా కొనసాగిస్తే అతి త్వరలో మంచి క్రీడాకారులవుతారు.

– ఎస్.చందు, డీఎస్‌ఏ హాకీ కోచ్

గ్రౌండ్‌కు రావడం ఆనందంగా ఉంది



నేను నాలుగో తరగతి చదువుతున్నాను. సెలవుల్లో గ్రౌండ్‌కు రావడం బాగుంది. ఉదయం, సాయంత్రం వేళల్లో హాకీ నేర్చుకుంటున్నా. మేముండేది కొత్తూరు తెలుగుగంగ కాలనీ. మా నాన్న రమణ కుమార్. ఆయన హాకీ స్టేట్ ప్లేయర్. నన్ను బాగా ప్రోత్సహిస్తున్నారు.

– బి.నిషిత

హాకీ ప్లేయర్ అవుతా



నాకు హాకీ అంటే ఇష్టం. ఏడో తరగతి చదువుతున్నా. మేం ఉండేది బీవీ నగర్. నాన్న వీరరాఘవులు. మా స్కూల్ పీఈటీ టీచర్ జ్యోతి ప్రోత్సాహంతో సెలవుల్లో గ్రౌండ్‌కి వస్తున్నా. హాకీ ప్లేయర్ కావడమే నా లక్ష్యం.

– రోహిత్,

ఖోఖో అంటే ఇష్టం



నేను 8వ తరగతి చదువుతున్నాను. కరెంటాఫీస్ వద్ద మేము ఉంటున్నాం. నాన్న మనోజ్ వీఆర్వో. ఆయన నన్ను గ్రౌండ్‌కు తీసుకెళ్తున్నారు. ఖోఖో చాలా ఇష్టం. రెండు పూటలా ఆడతాను. బాగా ఆడి ఆయనకు పేరు తెస్తాను.

– బి.కీర్తన్,

ఆసక్తి ఎక్కువ



ఆటలో మెలకువలు నేర్పించక ముందు వారికి ఫిట్‌నెస్ శిక్షణ ఇస్తాం. సీనియర్స్‌ను చూసి చిన్నారులు త్వరగా నేర్చుకుంటున్నారు. ఆర్థికంగా వెనుకబడిన వారు, దూర ప్రాంతాల్లో ఉన్నవారు సైతం రోజూ క్రమం తప్పకుండా శిక్షణకు వస్తున్నారు.

– సుకుమార్, డీఎస్‌ఏ ఖోఖో కోచ్

హత్య కేసులో నిందితుడి అరెస్టు

గుడ్లూరు: మద్యం మత్తులో ఓ వ్యక్తిని హత్య చేసిన నిందితుడు మహేష్‌ను అరెస్టు చేసినట్లు సీఐ సుబ్బారావు తెలిపారు. వివరాల్లోకి వెళ్తే.. ఈనెల 8న పాజర్ల గ్రామానికి చెందిన పాటి హనుమంతరావు, మహేష్ బైక్‌పై పొట్లూరు వచ్చి ధాన్యం బస్తా అమ్మి ఆ నగదుతో ఇద్దరు మద్యం కొనుగోలు చేశారు. పొట్లూరు, పాజర్ల గ్రామాల మధ్య జామాయిల్ తోటలో తాగారు. ఆ సమయంలో అప్పు విషయంలో ఇద్దరి మధ్య ఘర్షణ జరిగింది. దీంతో కోపోద్రిక్తుడైన మహేష్ బండరాయితో హనుమంతరావు (48)ను విచక్షణారహితంగా కొట్టడంతో అక్కడికక్కడే మృతి చెందాడు. మృతుని తల్లి సుబ్బమ్మ ఫిర్యాదు మేరకు ఎస్సై ప్రసాద్‌రెడ్డి మహేష్‌పై కేసు నమోదు చేశారు. దర్యాప్తులో భాగంగా తెట్టు రైల్వేస్టేషన్ రోడ్డు వద్ద మహేష్ ఉన్నాడని సమాచారం అందుకున్న సీఐ సుబ్బారావు శనివారం రాత్రి అదుపులోకి తీసుకున్నారు. ఆదివారం ఉదయం మహేష్‌ను కందుకూరు కోర్టులో హాజరుపరచగా న్యాయమూర్తి రిమాండ్ విధించినట్లు సీఐ చెప్పారు.

రోడ్డు ప్రమాదంలో వ్యక్తి దుర్మరణం

పొదలకూరు : మండలంలోని మహ్మదాపురానికి సమీపంలో ఆదివారం జరిగిన రోడ్డు ప్రమాదంలో విరువూరు ఎస్సీకాలనీకి చెందిన వ్యక్తి దుర్మరణం చెందారు. ఎస్సై కరిముల్లా కథనం మేరకు.. మహ్మదాపురానికి పనిపై వెళ్లిన కొప్పల పెంచలయ్య(45) బైక్‌పై విరువూరుకు తిరిగి వస్తున్నాడు. మార్గమధ్యలో తిప్పవద్ద గుర్తుతెలియని వాహనం అతివేగంగా పెంచలయ్య బైక్‌ను ఢీకొనగా తలకు బలమైన గాయమై అక్కడికక్కడే మృతి చెందాడు. మృతుడి భార్య రాజ్యలక్ష్మి ఫిర్యాదు మేరకు ఎస్సై కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

ఘనంగా మేకపాటి రాజమోహన్‌రెడ్డి జన్మదినం



నెల్లూరు(దర్గామిట్ట): నెల్లూరు మాజీ ఎంపీ మేకపాటి రాజమోహన్‌రెడ్డి జన్మదిన వేడుకలను నగరంలోని మేకపాటి క్యాంప్ కార్యాలయంలో ఆదివారం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన కేక్ కట్ చేసి అందరికీ పంచిపెట్టి కృతజ్ఞతలు తెలిపారు. వైఎస్సార్ సేవాదళ్ రాష్ట్ర అధ్యక్షుడు మాళెం సుధీర్‌కుమార్‌రెడ్డి, జెడ్పీ కో ఆప్షన్ సభ్యుడు గాజుల తాజుద్దీన్, ఆత్మకూరు మున్సిపల్ చైర్‌పర్సన్ వెంకటరమణమ్మ, వైఎస్సార్‌సీపీ మండల కన్వీనర్లు అల్లారెడ్డి ఆనంద్‌రెడ్డి, పులగం శంకర్‌రెడ్డి, బొర్రా సుబ్బిరెడ్డి పాల్గొన్నారు.

డీఎస్పీ విచారణ

ఇందుకూరుపేట : గిరిజన మహిళపై లైంగికదాడికి పాల్పడిన ఘటనపై నెల్లూరు టౌన్ డీఎస్పీ శ్రీనివాసులురెడ్డి ఆదివారం విచారణ గ్రామంలో చేపట్టారు. ఈ నేపథ్యంలో ఆయన ఇందుకూరుపేట పోలీస్‌స్టేషన్‌లో బాధిత మహిళ, నిందితుడి గురించి ఆరాతీశారు. ఈ సందర్భంగా డీఎస్పీ మాట్లాడుతూ నిందితుడు పాస్టర్ బిజయ్యపై కేసు నమోదు చేసినట్లు చెప్పారు. ఈ కేసుకు సంబంధించి పోలీస్‌శాఖలో ఎవరైనా నిర్లక్ష్యంగా వ్యవహరిస్తే కఠిన చర్యలు తప్పవని హెచ్చరించారు. ఆయన వెంట ఇన్‌చార్జి ఎస్సై వెంకటేశ్వరరావు ఉన్నారు.

వైద్యరంగంలో సంస్కరణలు అవసరం





మాట్లాడుతున్న డాక్టర్ పీవీ రమేష్... సభకు హాజరైన ప్రముఖులు

- వైద్యారోగ్యశాఖ రిటైర్డ్ ప్రిన్సిపల్ సెక్రటరీ రమేష్

నెల్లూరు(వేదాయపాళెం): వైద్య రంగంలో సంస్కరణలు అవసరమని, దీంతో పాటు ప్రతి ఒక్కరికీ మెరుగైన వైద్యం అందించేలా ప్రభుత్వాలు చర్యలు తీసుకోవాలని వైద్య, ఆరోగ్యశాఖ రిటైర్డ్ ప్రిన్సిపల్ సెక్రటరీ పీవీ రమేష్ అన్నారు. స్థానిక జెట్టి శేషారెడ్డి విజ్ఞాన కేంద్రంలో జెట్టి శేషారెడ్డి 13వ వర్ధంతిని ఆదివారం నిర్వహించారు. తొలుత ఆయన చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. అనంతరం 'ఆంధ్రప్రదేశ్ ప్రజారోగ్య వ్యవస్థ రేపటి అవసరాలు, ప్రభుత్వ బాధ్యత' అనే అంశంపై పీవీ రమేష్ మాట్లాడారు. జీడీపీలో వైద్య రంగానికి కేవలం 1.8 శాతం మాత్రమే నిధులు కేటాయిస్తున్నారని, దీనిని నాలుగు శాతానికి పెంచాలన్నారు. వ్యాధి నిర్ధారణ, మందులు, వైద్య చికిత్సపై పూర్తిస్థాయి శిక్షణ, అవగాహన కల్పించాలన్నారు. అభివృద్ధి చెందిన దేశాల్లో వైద్య రంగానికి తగిన ప్రాధాన్యత ఇస్తున్నారని, ఇందులో బీమా రంగం కీలకంగా మారిందన్నారు. ఇలాంటి విధానాన్ని దేశంలో కూడా అమలు చేయాలన్నారు.

జాతీయత పేరుతో రాజ్యాంగ స్ఫూర్తికి తూట్లు – ప్రొఫెసర్ నాగేశ్వర్



'జాతీయవాదం–ప్రస్తుత పోకడలు' అనే అంశంపై రాజకీయ విశ్లేషకుడు ప్రొఫెసర్ నాగేశ్వర్ మాట్లాడారు. జాతీయతపై ప్రస్తుత పాలకులు రాజ్యాంగ స్ఫూర్తికి తూట్లు పొడుస్తున్నారని విమర్శించారు. మతం ఆధారంగా దేశభక్తిని, జాతీయతను నిర్ధారించే దుష్ట సంప్రదాయానికి తెరతీస్తున్నారని ఆవేదన వ్యక్తం చేశారు. ఇదేమని ప్రశ్నించే వారిపై దేశద్రోహులు అంటూ అక్రమ కేసులతో వేధిస్తున్నారన్నారు. రాజకీయ పార్టీలన్నీ రాజ్యాంగ స్ఫూర్తిని కాపాడేందుకు కృషి చేయాలని కోరారు. మాజీ ఎమ్మెల్సీ విఠపు బాలసుబ్రహ్మణ్యం, విజ్ఞాన కేంద్రం చైర్మన్ చంద్ర రాజగోపాల్, యూటీఎఫ్ రాష్ట్ర కార్యదర్శి నవకోటేశ్వరరావు, డాక్టర్ రామచంద్రారెడ్డి, ప్రజా వైద్యశాల సూపరింటెండెంట్ డాక్టర్ రాజేశ్వరరావు, ప్రజారోగ్య వేదిక రాష్ట్ర నేత ఎంపీ రమణయ్య పాల్గొన్నారు.

పర్యావరణ పరిరక్షణతోనే మానవ మనుగడ

నెల్లూరు(బృందావనం) : మానవ మనుగడ పర్యావరణ పరిరక్షణతోనే సాధ్యమని 'చర్చ్ ఆఫ్ సౌతిండియా–డయాసిస్ ఆఫ్ మద్రాస్' బిషప్ జార్జి స్టీఫెన్ అన్నారు. చెన్నై నుంచి బిట్రగుంట వరకు పర్యావరణ పరిరక్షణపై మోటార్‌బైక్‌ల ర్యాలీ, కరపత్రాల పంపిణీ, వీధి నాటకాలు, పాటలు, చిత్రాలు, మొక్కలు నాటడం తదితర కార్యక్రమాలను వారు చేపట్టారు. ఇందులో భాగంగా వారు ఆదివారం మద్రాస్ బస్టాండ్ వద్ద చర్చిలో మొక్కలు నాటారు. అనంతరం ఆయన మాట్లాడారు. చెన్నై నుంచి బిట్రగుంట వరకు గ్రామీణ, పట్టణ, నగర ప్రాంతాల్లో గత నెల 29 నుంచి ఈనెల 10వ తేదీ వరకు వివిధ కార్యక్రమాలు చేపట్టినట్లు వివరించారు. ఆలిండియా క్రిస్టియన్ ఫెడరేషన్ రాష్ట్ర అధ్యక్షుడు ఉరందూరు సురేంద్రబాబు, లిబొనొపురం పాస్టరేట్ యూత్ ఫెలోషిప్ చైర్మన్ రెవరెండ్ డేవిడ్ సెల్వకుమార్ పాల్గొన్నారు.

తాతా మనవడు ఆత్మహత్య



గోపాలయ్య మృతదేహం



ధీరజ్‌కుమార్ మృతదేహం

నెల్లూరు(క్రైమ్): వయోభారంతో తాత, మానసిక సమస్యతో మనవడు ఆత్మహత్య చేసుకున్నారు. మృతదేహాలు కుళ్లి తీవ్ర దుర్గంధం రావడాన్ని గమనించిన స్థానికులు బంధువులకు, పోలీసులకు సమాచారం ఇవ్వడంతో ఈ విషయం ఆదివారం వెలుగులోకి వచ్చింది. ఈ విషాద ఘటన నెల్లూరులోని సత్యనారాయణపురంలో చోటుచేసుకుంది. పోలీసుల సమాచారం మేరకు.. నవాబుపేటకు చెందిన డాక్టర్ ఎ.ప్రదీప్‌కుమార్ స్థానికంగా వైద్యశాల నిర్వహిస్తున్నారు. ఆయనకు సత్యనారాయణపురానికి చెందిన గోపాలయ్య కుమార్తె విజయలక్ష్మితో వివాహమైంది. వారికి ధీరజ్‌కుమార్(32), దినేష్‌కుమార్ సంతానం. విజయలక్ష్మి సుమారు పదహారేళ్ల క్రితం మృతిచెందారు. దీంతో ప్రదీప్‌కుమార్ మరో వివాహం చేసుకున్నారు. కుమారులిద్దరూ బీటెక్ పూర్తి చేశారు. అనంతరం ధీరజ్‌కుమార్ ఎంటెక్ చదివేందుకు లండన్‌కు వెళ్లగా, దినేష్‌కుమార్ హైదరాబాద్‌లో ఉద్యోగంలో చేరారు. తల్లి మృతిచెందినప్పటి నుంచి ధీరజ్‌కుమార్ మానసికంగా కృంగిపోయాడు. లండన్‌లో ఉండలేక నెల్లూరుకు వచ్చేశాడు.

తాతతో కలిసి..

గోపాలయ్య(78) భార్య మృతిచెందడంతో ఒంటరిగా ఉంటున్నారు. దీంతో ధీరజ్‌కుమార్ తన తాత వద్దనే ఉంటూ అప్పుడప్పుడు తండ్రి వద్దకు వెళ్లేవాడు. ధీరజ్‌కుమార్ మానసిక పరిస్థితి బాగలేకపోవడంతో సైకాలజిస్టు వద్ద చికిత్స పొందుతున్నాడు. గోపాలయ్య వయోభారంతో, ధీరజ్‌కుమార్ మానసిక సమస్యలతో జీవించడం కష్టంగా ఉందని తరచూ వారు ప్రదీప్‌కుమార్, బంధువుల వద్ద చెబుతుండడంతో వారు ఏమీ కాదని ధైర్యం చెప్పేవారు. ఈ నేపథ్యంలో ఈనెల 8న ధీరజ్‌కుమార్ తన తండ్రి వద్దకు వెళ్లి అవసరాల నిమిత్తం నగదు తీసుకెళ్లాడు. అప్పటి నుంచి తండ్రి వద్దకు రాలేదు. ఈ క్రమంలో ఆదివారం గోపాలయ్య ఉంటున్న ఇంట్లో నుంచి దుర్వాసన రావడాన్ని స్థానికులు గమనించారు. ఈ విషయాన్ని డాక్టర్ ప్రదీప్‌కుమార్‌కు తెలియజేశారు. అందరూ వెళ్లి తలుపులు పగులగొట్టి చూడగా గోపాలయ్య మంచంపై, ధీరజ్ నేలపై మృతిచెంది ఉన్నారు. వారి నోట్లో నుంచి నురగలు వచ్చి ఉన్నాయి. మృతదేహాల వద్ద వివిధ కంపెనీలకు చెందిన మాత్రలు పడి ఉన్నాయి. ఈ మేరకు ప్రదీప్‌కుమార్ నవాబుపేట పోలీసులకు ఫిర్యాదు చేశారు. నవాబుపేట ఇన్‌స్పెక్టర్ టీవీ సుబ్బారావు, ఎస్సై తిరుపతయ్య ఘటనా స్థలానికి చేరుకుని మృతదేహాలను పరిశీలించారు. ఘటనా స్థలంలో మాత్రలు ఉండడంతో ఆత్మహత్య చేసుకుని ఉంటారని, మృతదేహాలు కుళ్లి ఉండడంతో చనిపోయి రెండు, మూడు రోజులై ఉండొచ్చని పోలీసులు భావిస్తున్నారు. మృతదేహాలను జీజీహెచ్ మార్చురీకి తరలించి పోలీసులు కేసు దర్యాప్తు చేస్తున్నారు.